ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	583.10 (291.9562)	4,32,065	4,32,065
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.40 (3.79)	6835.84	6125.5
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	165.183 (31.8797)	4,28,115	4,32,175

చికెన్ ధరలు | లైవ్ : రూ.134 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.225

ఎరువుల కొరత

- » ముమ్మరంగా సాగు పనులు
- » సరిపడా అందని యూరియా, డీఏపీ
- » పీఏసీఎస్‌ల ఎదుట రైతుల బారులు



జిల్లాలో ఎరువుల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. వరుసగా వర్షాలు కురుస్తుండటం జిల్లాలో సాగర్, మూసీ ఆయకట్టు పరివాహకంలో వరి, పత్తి పంటల సాగు పనులు ముమ్మరం అయ్యాయి. ఈ ఏడాది ముందుగా వర్షాలు పడటంతో బావులు, చెరువులు, కుంటల కింద రైతులు ముందస్తుగా నార్లు పోశారు. దీంతో యూరియా వినియోగం విపరీతంగా పెరిగింది. సాగుకు అవసరమైన డీఏపీ, యూరియా అందుబాటులో లేకపోవడంతో నానాఇబ్బందులు పడుతున్నారు. అయితే అవసరాలకు తగ్గట్టుగా సరఫరా కాకపోవడంతో పీఏసీఎస్‌లతో పాటు దుకాణాల ఎదుట రైతులు బారులు తీరుతున్నారు.

- వివరాలు 7వ పేజీలో

వాతావరణ మార్పులు, పక్షం రోజులుగా కురుస్తున్న వర్షాలతో దోమలు పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల మధ్య, మురుగుకాల్వల్లో నిలిచిన నీళ్లు దోమలకు ఆవాసాలుగా మారాయి. ఇటీవల జిల్లా కేంద్రంలో వృథా జలాల్లో ఆయిల్‌బాల్స్ వదిలారు. ఇది ఒకరోజుకు ఒక ప్రాంతానికే పరిమితమైంది. ఆ తర్వాత షరా మామూలైంది. జిల్లాలోని ప్రతీ పట్టణంలోనూ ఇదే పరిస్థితి. దీంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)



దోమల మోత

- » వార్డుల్లో అడపాదడపా మందుల పిచికారీ
- » లక్షలు వెచ్చిస్తున్నా కానరాని ఫలితం
- » అనారోగ్యం పాలవుతున్న ప్రజలు

జిల్లా కేంద్రానికి చెందిన ఒక ప్రైవేట్ ఉద్యోగం చేసుకునే వ్యక్తికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల చిన్నకుమారుడికి జ్వరం రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అన్ని పరీక్షలు చేసిన వైద్యులు మలేరియా అని నిర్ధారించారు. జ్వరానికి దోమలు ప్రధాన కారణమని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.ఇలా ఎంతో మంది చిన్నారులు దోమలతో అనారోగ్యం పాలవుతున్నారు. జిల్లాలోని ఐదు మునిసిపాలిటీల్లోని 141వార్డుల్లో ఏదో ఒక ప్రాంతంలో ఇళ్ల మధ్య వరద, మురుగునీరు చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

తలుపు తెరిస్తే దోమల దండు

జిల్లా కేంద్రమైన సూర్యాపేటలో దోమలు విజృంభిస్తున్నాయి. సాయంత్రం తలుపు తెరిస్తే చాలు దోమలు ఇంటి నిండా చేరుతున్నాయి. వారం రోజులుగా వర్షాలు కురియడంతో గడ్డి దోమలు పెరిగాయి. 48 వార్డుల్లో పెద్దసంఖ్యలో మురుగు కాల్వలు ఉన్నాయి. సిబ్బంది కాల్వలను శుభ్రం చేస్తున్నప్పటికీ దోమల తాకిడి తగ్గడం లేదు. వర్షాలతో కాల్వలు శుభ్రం చేయడం కూడా వారికి ఇబ్బందిగా మారింది. జిల్లాలో మొత్తం ఐదు మునిసిపాలిటీలు ఉండగా అన్ని పట్టణాల్లోని శివారు కాలనీల్లో దోమల బెడద పెరిగింది. ప్రధానంగా పట్టణంలోని పలు ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు అధికంగా ఉన్నాయి. అక్కడికి వర్షపు నీరు చేరి చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. నిల్వ ఉన్న నీరు దోమలకు ఆవాసాలుగా మారి పెరిగిపోతున్నాయి.

రూ.లక్షలు ఖర్చు చేసినా కానరాని ఫలితం

జిల్లాలో ఐదు మునిసిపాలిటీల్లో కలిపి పారిశుధ్య కార్మికులు 800 మంది ఉన్నారు. సూర్యాపేటలో రోడ్లు ఊడ్చడానికి, మురుగు కాల్వల్లో పూడిక తీయడానికి రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది 310 దాకా పనిచేస్తున్నారు. జిల్లా కేంద్రం కావడంతో కొంతమంది పారిశుధ్య సిబ్బందిని ఇతర శాఖలకు కూడా కేటాయించారు. ఇదిలా ఉండగా మెయిన్ రోడ్డు, వాణిజ్య భవన్, ఈద్గా రోడ్డులో సైతం దుర్గంధం వెదజల్లుతోంది. ప్రతి ఏడాది దోమల నివారణకు మందులు పిచికారీ చేస్తున్నారు. ఇందుకోసం ఏడాదికి రూ.2.50లక్షల నుంచి రూ.3లక్షల దాకా ఖర్చు చేస్తున్నారు. ఇవి కూడా పలుకుబడి గల వారి ఇళ్ల ముందే పిచికారీ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సున్నం, బ్లీచింగ్ కోసం రూ.లక్ష నుంచి రూ.2.లక్షల దాకా ఖర్చు చేస్తున్నారు. పారిశుధ్య సిబ్బంది జీతాలకు నెలకు రూ.30 లక్షల నుంచి రూ.40లక్షల దాకా ఖర్చవుతోంది. ఇంత ఖర్చు పెట్టినా దోమలను నివారించలేకపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు, వరద నీరు నిల్వ ఉంటున్నాయి.

అండర్ డ్రైనేజీతో ఉపశమనం

జిల్లాలో అమృత్‌పథకం 2.0 కింద..

మిగతా 8వ పేజీలో...

పులిచింతలకు పెరిగిన వరద

13 గేట్ల నుంచి నీటి విడుదల




జిల్లా సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టుకు వరద పెరిగింది. ఎగువన కురుస్తున్న వర్షాలతో కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండి 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో పులిచింతల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 4,28,121 క్యూసెక్కులు వస్తోంది. ప్రాజెక్టు 13 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో బుగ్గమాదారం నుంచి జగ్గయ్యపేట వైపు పోయే రోడ్డుపై నాలుగు మీటర్ల మేర నీరు నిలిచి రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. వజినేపల్లి, బుగ్గమాదారం గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో పత్తి, పంట మిర్చి పొలాలు నీట మునిగాయి.

- వివరాలు 7వ పేజీలో

వర్షాలకు 4,800 ఎకరాల్లో పంట నష్టం

దెబ్బతిన్న 271 విద్యుత్‌స్తంభాలు

భానుపురి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇటీవల వర్షాలకు సుమారు 4,800 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాకు వచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన నివేదికలో పక్షం రోజుల్లో కురిసిన వర్షాలకు వరి, పత్తి పంటలు నష్టపోయినట్లు పేర్కొంది. అయితే వానాకాలం సీజన్ మొదటి దశలోనే ఉండటంతో కొంత మేరే పంట నష్టం వాటిల్లినట్లు పేర్కొంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిన చోట, వాగులు, వంకలు ఉన్న చోటనే వరి, పత్తి దెబ్బతిన్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్లచెర్వు, కోదాడ ప్రాంతాల్లో ఎక్కువ పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో 3,800 ఎకరాల్లో వరి, పత్తి పంటలు దెబ్బతిన్నట్లు అంచనాలు వేశారు. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో కలిపి 1,000 ఎకరాల్లో మాత్రమే పంటలు నష్టం జరిగినట్లు సూర్యాపేట వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వరి,



పత్తి పంటలు మరో నాలుగైదు రోజులు నీటిలో ఉన్నా ఏమి నష్టం ఉండదని, వారం పాటు ఉంటే మొక్క దెబ్బతింటుందని తెలిపారు. ఇదిలా ఉండగా వేల రూపాయలు పెట్టుబడి పెట్టి వర్షాలకు నష్టపోయామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం నామమాత్రపు సర్వే చేసి కొంతమేరే నష్టం జరిగిందని అంచనాలు వేసి చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ నెలలో జిల్లాలో కురిసిన వర్షాలకు 271 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. బోరుబావుల ఎల్‌టీ లైన్ విద్యుత్ స్తంభాలు 199, 11కే విద్యుత్ స్తంభాలు 72 విరిగినట్లు సూర్యాపేట ఎస్ఈ ఫ్రాంక్లిన్ తెలిపారు.

గురుకులాల టీచర్లపై .. అదనపు భారం

బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. అందుకు పురాతన భారతీయ విద్యావిధానం తరహాలో గురుకులాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో ఉపాధ్యాయుల పోస్టుల నియామకం చేపట్టింది. కానీ విద్యార్థులు భోజన, ఇతర మౌలికసదుపాయాల కల్పనలో కీలక పాత్రవహించే వార్డెన్ల నియమకాలపై దృష్టి సారించలేదు. దీంతో ఆ విధులను వంతులవారీగా పంచుకుంటూ ఉపాధ్యాయులే నిర్వహిస్తున్నారు. వెరసి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-కోదాడ)



- » వంతుల వారీగా వార్డెన్ల విధులు
- » బోధనపై తీవ్ర ప్రభావం
- » విద్యార్థులకు అందని నాణ్యమైన బోధన

జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో ఎక్కడా వార్డెన్లు లేరు. అయితే ఆ బాధ్యతలు ఉపాధ్యాయులలే చూస్తుండగా వారిపై అదనపు భారం పడుతోంది. బోధనతో పాటు విద్యార్థుల కేర్‌టేకర్ విధులు చూడాల్సి వస్తోంది. దీంతో ఒక పక్క బోధనతో పాటు, వంతుల వారీగా విద్యార్థులకు కేర్‌టేకర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. నాన్‌టీచింగ్ పనులతో వారిపై అదనపు భారం పడి, బోధనపై దృష్టి సారించ డం లేదన్న విమర్శలు వస్తున్నాయి. విద్యార్థుల కు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజ నం, సాయంత్రం స్నాక్స్ రాత్రి డిన్నర్ ఏర్పాట్లకు ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరిగా పర్యవేక్షించాల్సి వస్తోంది. కాంట్రాక్టర్ సరుకులు ఇవ్వటమే తప్ప అతడికి విద్యార్థుల భోజన ఏర్పాట్ల విషయంలో సంబంధం లేదు. ఫలితంగా ఉపాధ్యాయులే విద్యార్థుల వసతుల కల్పనకు పనిచేయాల్సి వస్తోంది. వసతులు పర్యవేక్షించే ఉపాధ్యాయుడే విద్యార్థులకు రోజూ ఇచ్చే ఉప్పులు, పప్పులు, గుడ్లు, చికెన్, మటన్‌కు సంబంధించిన ఏర్పాట్లతో పాటు వాటిని రికార్డుల్లో రాయాల్సి ఉంటుంది. దీంతో ఆ ఉపాధ్యాయుడు విద్యాబోధనను అడపాదడపా తప్ప పూర్తిస్థాయిలో తీసుకునే పరిస్థితి ఉండటం లేదు. విద్యార్థులకు నష్టం జరగకుండా ఆ ఉపాధ్యాయుడు తీసుకునే తరగతులు, ఇతర ఉపాధ్యాయులకు కేటాయించే పరిస్థితి వీలులేదు. గణితం తీసుకునే టీచరు సాంఘిక శాస్త్రం బోధన చేయలేడు. దీంతో కేర్‌టేకర్ విధులు నిర్వహించే ఉపాధ్యాయుడు బోధన అంతంత మాత్రమే నడుస్తుందనేది వాస్తవం. ఈ నేపథ్యంలో గురుకులాల్లో వార్డెన్ల పోస్టులను ఏర్పాటుచేసి, వారికే విద్యార్థుల వసతులు చూసుకునే బాధ్యత అప్పజెప్పితే విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజన వసతులు అందడంతో పాటు ఉపాధ్యాయులపై అదనపు భారం తగ్గి ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని విద్యానిపుణులు పేర్కొంటున్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాలో 22 గురుకులాలు

జిల్లాలో బీసీ 10,ఎస్సీ 8,ఎస్టీ 4 కలిపి మొ త్తం 22 గురుకులాలు ఉన్నాయి. కాగా బీసీ గురుకులాల్లో ఒక ఉపాధ్యాయుడు ఏడాది పాటు విద్యార్థులకు కేర్‌టేకర్‌గా వ్యవహరిస్తుండగా, ఎస్సీ గురుకులాల్లో మూడు నెలలకు, ఎస్టీ గురుకులాల్లో నెలకు ఒక ఉపాధ్యాయుడు వంతుల వారీగా వసతుల కల్పన విధులు నిర్వహిస్తున్నారు. అదనపు భారంతో తరగతుల బోధన అంతంత మాత్రంగానే ఉంటుందని ఉపాధ్యాయ నిపుణులు చెబుతున్నారు. మైనార్టీ గురుకులాల మాదిరి బీసీ,ఎస్సీ,ఎస్టీ గురుకులాలోట్ల వార్డెన్లను నియమించి, ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

నాణ్యమైన పురుగు మందులు ఎరువులు అందించాలి

మఠంపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందజేయాలని హుజూర్‌నగర్ ఏడీఏ రవినాయక్ అన్నారు. గురువారం వర్ధాపురం, మఠంపల్లి గ్రామాల్లో ఎరువుల, పురుగు మందుల దుకాణాలను ఏవో బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. నిల్వల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు ఉన్న సరుకులను మాత్రమే విక్రయించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయాన్ని సందర్శించి ఎరువుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం లబ్ధిదారులకు మందులు పంపిణీ చేశారు. ఆయనవెంట ఏవో శ్రీనివాస్, సీఈవో తిరపతయ్య, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.



వర్ధాపురంలో ఎరువుల దుకాణంలో నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ రవినాయక్

12 గ్రామాలకు నిలిచిన తాగునీరు

చింతలపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ పంప్‌హౌస్‌కు వెళ్లే పైపులైన్ పైపులు ఊడటంతో 12 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచింది. ఎర్ర వాగు వరద ఉధృతికి చింతలపాలెం మండలం బుగ్గమాదారం నుంచి మేళ్లచెర్వు మండలం రామాపురంలో నిర్మించిన మిషన్ భగీరథ పంప్‌హౌస్‌కు వెళ్లే పైపులైన్ పైపులు ఊడాయి. దీంతో పంపుహౌస్‌కు నీరు చేరక దొండపాడు, రామాపురం, హేమ్లాతండా, కప్పలకుంటతండా, ఎతిరాజపురంతండా, దుబ్బతండా, జగ్గుతండా, కూచిపూడితండా, మంగలకుంటతండా, సాధుతండా, శివబాలాజీనగర్‌తండా, రామాంజనేయతండాలకు వెళ్లే భగీరథ నీళ్లు ఆగిపోయాయి. ఇప్పటివరకు ఈ గ్రామాల్లో అధికంగా వర్షాలు కురవడంతో మంచినీటి ఎద్దడి ఏర్పడలేదు. బుధవారం నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టటంతో భగీరథ నీరు రావడంలేదని తెలిసింది. దొండపాడు రహదారిపై నిర్మించిన వంతెన పక్కన మిషన్ భగీరథ పైపులు కొట్టుకుపోవటమే కారణమని గుర్తించారు.ఈ విషయమై మిషన్ భగీరథ ఏఈఈ సిద్ధార్థను వివరణ కోరగా, సోమవారం నుంచి పనులను ప్రారంభిస్తామన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలి

హుజూర్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలే శరణ్యమని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన కార్మిక చట్టాలను వ్యతిరేకించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని, అంగన్‌వాడీ కార్యకర్తలను, ఆయాలను వేధింపులకు గురిచేస్తోందన్నారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు వెంటనే మంజూరు చేయాలన్నారు. సమావేశంలో వెంకటనారాయణ, ఎలక సోమయ్య, రాధాకృష్ణ, సైదులు, దుర్గారావు, మల్లయ్య, తిరుపతన్న, పోసనబోయిన హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సద్దులచెరువును పర్యాటకంగా తీర్చిదిద్దుతాం

సూర్యాపేట టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సద్దుల చెరువును పర్యటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువును పరిశీలించి మాట్లాడారు. చెరువు పక్కన ఉన్న ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలను తొలగించి పూల మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణం సృష్టించాలన్నారు. మునిసిపాలిటీ మాస్టర్ ప్లాన్ ప్రకారం సద్దుల చెరువు పరిధిని మునిసిపల్ కమిషనర్, ఇరిగేషన్ అధికారులు గుర్తించాలని, ఖాళీ ప్రదేశాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి నివేదిక అం దజేయాలని పర్యాటక శాఖ ఏఈని కలెక్టర్ ఆదేశించా రు. కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవ్, మునిసిపల్ క మిషనర్ సీహెచ్ హన్మంతరెడ్డి,డీఈ పాండునాయక్, టూ రిజం ఏఈ మణికంఠ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సద్దుల చెరువు అభివృద్ధిపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన శాంతి సమావేశంలో ఎస్పీ నర్సింహతో కలసి మాట్లాడారు. మండపాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కాకుండా అన్నిజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డివిజన్, మండలస్థాయిలో ఆర్డీవోలు, డీఎస్పీలు తమసిబ్బందితో క్షేత్రస్థాయి పర్యటన చేయించి కార్యాచరణ రూపొందించాలన్నారు. ఎస్పీ నర్సింహ మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హుజూర్‌నగర్‌లోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లో 2025–27 విద్యాసంవత్సరంలో వివిధ కోర్సుల్లో ప్రవేశాల్లో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు సెల్ నెం.9441993390కు సంప్రదించాలన్నారు.

ఉండ్రుగొండలో శ్రావణమాస పూజలు

చివ్వెంల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస శివరాత్రి సందర్భంగా మండలంలోని ఉండ్రుగొండ గిరిదుర్గంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉమామహేశ్వర స్వామికి గురువారం మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. మనోహరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అభిషేకాల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణకుమార్, కృష్ణమోహన్, శ్రీనివాస్, సంతోష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఉండ్రుగొండలో అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మకు బోనాలు

హుజూర్‌నగర్, చింతలపాలెం, నేరేడుచర్ల ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం చివరి గురువారం సందర్భంగా హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారం గ్రామంలో, చింతలపాలెంలో, నేరేడుచర్ల మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామంలో మహిళలు బోనాలు ఎత్తుకుని, మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మకు సమర్పించారు. అనంతరం ఆలయాల్లో మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో చింతలపాలెంలో కాంగ్రెస్, సీపీఐ కార్యకర్తలు, హుజూర్‌నగర్ మండలం వేపలసింగారంలో మాజీ సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి, సారెడ్డి భాస్కర్‌రెడ్డి, నందిరెడ్డి సైదిరెడ్డి, రెక్కల శంభిరెడ్డి, కోటిరెడ్డి, వెంకటరెడ్డి, రా మిరెడ్డి, ఊరె రాధాకృష్ణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

లింగగిరి మేజర్ కాల్వలో చెత్త తొలగింపు

హుజూర్‌నగర్ , ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్ పరిధిలోని లింగగిరి మేజర్‌లోని తిరుపతమ్మ దేవాలయం సమీపంలోని ఎన్నెస్పీ కాల్వలో గురువారం నీటిప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్తాచెదారం, పశువుల కళేబరాలను తొలగింపజేశారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'చెత్తాచెదారంతో కాల్వలు.. నీరెళ్లేదెలా' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎన్నెస్పీ ఈఈ రాంకిషోర్ స్పందించారు. తూములకు అడ్డుగా ఉన్న చెత్తాచెదారం, పశువుల కళేబరాలను తొలగించాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. దీంతోపాటు చివరి భూములకు నీరందించేలా నీటిప్రవాహాన్ని పెంచారు. ప్రతిఏటా ఈ పైప్‌లైన్ కల్వర్టు వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి నీటి సరఫరా సక్రమంగా జరగడంలేదు. దీంతో కొన్నేళ్లుగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.



కల్వర్టు వద్ద చెత్తాచెదారం, పశువుల కళేబరాలను తొలగిస్తున్న సిబ్బంది

పర్యావరణ హితమైన అభిమానం



సినీనటుడు చిరంజీవి జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు పర్యావరణ హితమైన పని చేశారు. పర్యావరణ ప్రేమికుడు, అభిమాన సంఘ నాయకుడైన అవిరెండ్ల సందీప్ 15వేల విత్తనాలు నాటి అభిమాన హీరో చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపారు. చిరంజీవి బ్లడ్ బ్యాంకు స్థాపించిన నాటినుంచి పలుమార్లు రక్తదానం చేయడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మిత్రులతో కలిసి నాలుగు లక్షల విత్తనాలు సేకరించి అడవిలో చల్లినట్లు తెలిపారు. సందీప్‌తో పాటు బొంగర్ల నరేష్, కందికంటి సంజీవ, ఉబ్బపల్లి రాజేష్, పవన్, విష్ణు, చింటు తదితరులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

సంస్కృతికి ప్రతిబింబం పండుగ



బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రతీకలు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని విశాల భారతి హైస్కూల్ విద్యార్థులు గురువారం బోనాల ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోతురాజుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విశాల భారతి హైస్కూల్ కరస్పాండెంట్ బీమిడి సుభాష్‌రెడ్డి, నిర్వాహకుడు చైతన్య క్రాంతివర్ధన్‌రెడ్డి, హెచ్‌ఎం కే ఆంజనేయులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి- చౌటుప్పల్ టౌన్)

ఎలా ఉన్నావ్ భరత్.. నువ్వు ఎస్‌ఐ కావాలి



యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం శేరిగూడెం గ్రామాన్ని గురువారం ఆ జిల్లా కలెక్టర్ హనుమంతరావు సందర్శించారు. తాను దత్తత తీసుకున్న విద్యార్థి భరత్‌చంద్రాచారి ఇంటికి వెళ్లారు. భరత్ ఎలా ఉన్నావంటూ పలుకరించారు. మీ అమ్మ, చెల్లి ఆరోగ్యం ఎలా ఉంది, నీకు నచ్చిన కాలేజీ, గ్రూప్‌లో చేర్పించా, చదువు ఎలా సాగుతుందని విద్యార్థిని అడిగి తెలుసుకున్నారు. ఏం కావాలన్నా ఫోన్ చేయమని భరోసా ఇచ్చారు. నువ్వు కోరుకున్నట్లు ఎస్‌ఐ కావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా నెల రోజులకు కావాల్సిన ఇంటి సామగ్రి, ఆర్థికసాయంగా రూ.5 వేలు అందజేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివా‌సరెడ్డి, ఎంపీడీవో ప్రమోద్‌కుమార్, ఎంపీవో నర్సింహారావు, కార్యదర్శి సుభాష్ ఉన్నారు.

(ఆంధ్రజ్యోతి-సంస్థాన్‌నారాయణపురం)

సైకిల్ చక్రంతో దంతె తయారీ

సమయం ఆదా, కూలీల కొరతను అధిగమిస్తున్న రైతు శ్రీను

(ఆంధ్రజ్యోతి-తుర్కపల్లి)

స్వయంశక్తితో యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం బద్దుతండాకు చెందిన గుగులోతు శ్రీనివాస్ సాగులో ముందుకు సాగుతున్నాడు. సమయాన్ని ఆదా చేసుకోవడంతో పాటు కూలీల కొరతను అధిగమించేందుకు పాత సైకిల్‌చక్రంతో కలుపు(దంతె) యంత్రాన్ని రూపొందించాడు. వ్యవసాయ రంగంలో కొంతమంది ఆధునిక పద్ధతుల్లో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సాగు చేస్తుండగా, మరికొందరు పాతతరం పద్ధతులను అవలంభిస్తున్నారు. ఏ విధానం పాటించినా అందరూ ఎదుర్కొనే ప్రధాన సమస్య కలుపు తీత. ఒక్కసారి పెరిగిన కలుపు పంటను ఎదగనివ్వదు. కలుపు నివారణకు రైతులు ఎడ్లతో దంతె కొట్టడం, కూలీలతో కలుపు తీయిస్తుంటారు. అయితే దంతె కొట్టాలంటే ఎద్దులు కావాలి, జంట ఎద్దులు కొనాలంటే రూ.70 వేల వరకు ఖర్చవుతుంది. అద్దెకు తీసుకున్నా రోజుకు రూ.1000 చెల్లించాలి. ఇది చిన్న, సన్నకారు రైతులకు ఆర్థికభారంతో కూడింది. కూలీలతో కలుపు తీయించాలంటే కూలీల కొరత వేధిస్తోంది. ఈ నేపథ్యంలో గుగులోతు శ్రీను వినూత్నంగా ఆలోచించి కలుపు నివారణకు ఓ యంత్రాన్ని తయారు చేయించుకున్నాడు. రూ.1,800లతో సైకిల్ చక్రానికి చిన్నపాటి దంతెను తయారు చేయించాడు. ఈ దంతె వాణిజ్య పంటల్లో మాత్రమే కలుపు తీయడానికి ఉపయోగపడుతుందని, రోజుకు ఒక వ్యక్తి గుంట భూమిలో కలుపు తీయవచ్చునని రైతు శ్రీను తెలిపాడు.



బద్దుతండాలో సైకిల్ చక్రంతో తయారు చేసిన దంతెతో కలుపు తీస్తున్న రైతు శ్రీనివాస్

జాన్‌పహాడ్ గ్రామకార్యదర్శిపై కేసు నమోదు

నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపర్చిన అధికారులు

పాలకవీడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్‌పహాడ్ గ్రామపంచాయతీ కార్యదర్శి ఇంజమూరి వెంకయ్యను గురువారం ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో అరెస్టుచేశారు. అనంతరం హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ కోర్టులో అతడిని హాజరుపర్చారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు లబ్ధిదారుల నుంచి లంచం అడిగినట్లు ఆడియో వైరల్ కావడంతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యదర్శిని సస్పెండ్ చేయడంతో పాటు ఏసీబీ కేసు నమోదుచేయాలని ఆదేశించిన నేపథ్యంలో గురువారం విచారణకు వచ్చిన ఏసీబీ అధికారులు కార్యదర్శి వెంకయ్యపై కేసు నమోదు చేసి అతడిని అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు. ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ మాట్లాడుతూ అవినీతి, అక్రమాలను సహించబోమన్నారు.



కార్యదర్శి వెంకయ్య, వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ

రెవెన్యూ రికార్డులు మార్చిన వ్యక్తిపై కేసు నమోదు

గరిడేపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ రికార్డులు మార్చిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట జిల్లా గరిడేపల్లి ఎస్‌ఐ నరేష్ తెలిపారు. మండలంలోని కల్మలచెర్వు రెవెన్యూ రికార్డు పరిధిలోని సర్వే నెంబర్ 59లోని వ్యవసాయ భూమి రమావత్ నాగమణి పేరున ఉంది. అయితే 2010-11 రెవెన్యూ పహణీలో భూక్యా శంకర్ అనే వ్యక్తి నాగమణి పేరును చెరిపి తన పేరు పట్టాదారు కాలంలో రాశాడు. గుర్తించిన గరిడేపల్లి తహసీల్దార్ బండ కవిత ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపాడు.

ఎవరి ప్రమేయం ఉందో తేల్చండి: కలెక్టర్

కల్మలచెర్వు పట్టా రికార్డుల్లో పేరు మార్చిన ఘటనపై సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ స్పందించారు. గురువారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో గరిడేపల్లి మండల కార్యాలయంలో రికార్డుల్లో పేరు మార్చిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. రికార్డుల్లో మరొకరి పేరు చేర్చడంలో శంకర్‌తో పాటు ఎవరి ప్రమే యం ఉందో తేల్చాలని, తదుపరి వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కవితను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా లావణ్యరాణి

మిర్యాలగూడ లీగల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా మజ్జి లావణ్యరాణి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా లావణ్యరాణి స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లా బొబ్బిలి ప్రాంతం.

మృత్యువులోనూ వీడని స్నేహం

- రోడ్డు ప్రమాదంలో స్నేహితులు దుర్మరణం
- సాగర్ - హైదరాబాద్ రహదారిపై ప్రమాదం

చింతపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బోనాల పండుగకు వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు దుర్మరణం చెందారు. బుధవారం అర్ధరాత్రి నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం వెంకటేశ్వరనగర్(మాల్)లో సాగర్-హైదరాబాద్ హైవేపై జరిగింది. ఎస్‌ఐ రాంమూర్తి, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చింతపల్లి మండలం వెంకటేశ్వరనగర్‌కు చెందిన కోడిదూటి నరసింహ(23), తల్లోజు సందీప్ (22) స్నేహితులు. నరసింహ ఇంటర్ పూర్తి చేసి తండ్రి రమేష్‌తో కలిసి ప్లంబర్ పనిచేస్తుండగా, సందీప్ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నాడు. తమ గ్రామానికి సమీపంలో ఉన్న రంగారెడ్డి జిల్లా యాచారం మండలం పాత మాల్‌లో బోనాలు నిర్వహిస్తుండగా, పండుగను చూసేందుకు బుధవారం ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి గ్రామానికి వస్తుండగా వెంకటేశ్వరనగర్(మాల్)లో అదుపుతప్పి సాగర్ - హైదరాబాద్ ప్రధాన రహదారిపై డివైడర్‌ను ఢీకొనటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాంమూర్తి తెలిపారు. తమకు ఆసరాగా ఉంటున్న కుమారులు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు, బంధువులు రోదనలు మిన్నంటాయి. నరసింహ, సందీప్ మంచి స్నేహితులని, మరణంలోనూ స్నేహాన్ని వదలలేదని స్థానికులు కంటతడి పెట్టుకున్నారు.



వెంకటేశ్వరనగర్‌లో రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



నరసింహ(ఫైల్)




సందీప్(ఫైల్)

యాదాద్రి పవర్‌ప్లాంట్ సూపర్‌వైజర్

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం కొత్తగూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదాద్రి పవర్‌ప్లాంట్ సూపర్‌వైజర్ మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ-2 సైదులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని హైమద్‌నగర్ సమీపంలోని గౌతమ్‌కాలనీకి చెందిన సోమనాథ్ ఉత్తమ్‌గారడీ(27) రెండేళ్లుగా దామరచర్ల మండలంలోని యాదాద్రిపవర్ ప్లాంట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఔషధాల కోసం తన ద్విచక్రవాహనంపై మిర్యాలగూడకు వస్తున్నాడు. మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం సోమనాథ్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఉత్తమ్‌గారడీ బంధువు సంతోష్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించగా దహన సంస్కారాల కోసం స్వగ్రామానికి తీసుకెళ్లారు.

ప్రమాదాలకు నిలయంగా మలుపులు



ప్రమాదకరంగా విరాట్‌నగర్ నుంచి వింజమూర్‌కు వెళ్లే దారిలో మలుపు

చింతపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రద్దీగా మారిన ఈ రహదారిపై మూలమలుపులు ఇరుకు రహదారి ప్రాణాలను తీస్తున్నాయి. ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి.

పెరిగిన రద్దీ

నాగార్జునసాగర్ క్రస్ట్‌గేట్లు 26 ఎత్తడంతో హైదరాబాద్-నాగార్జునసాగర్ రహదారిపై పర్యాటకుల రాకపోకల రద్దీ మరింత పెరిగింది. 32 కిలోమీటర్లు విస్తరించి ఉన్న ఈ రహదారిపై వాహనదారులు మితిమీరిన వేగం, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, అజాగ్రత్త, నిద్రమత్తుతో వాహనాలు నడుపుతుండటంతో అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. నిత్యం ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో అధికారులు హెచ్చరిక బోర్డులు, సూచికలు వేగ నియంత్రణ చర్యలు చేపట్టలేదు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలేపల్లిరాంనగర్, మదనాపురం గేట్ నుంచి వెళ్లే మార్గంలో వాహనాలు అధిక శాతం అదుపుతప్పుతున్నాయి. ప్రశాంతపురి తండా, కుర్మేడ్‌గేట్, విరాట్‌నగర్‌కాలనీ సమీపంలో రోడ్డు ప్రమాదకరంగా మారింది. ధైర్యపురితండాతో వింజమూరు, చింతపల్లి, నసర్లపల్లి సమీపంలో మూలమలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి.

సూచికలు ఏర్పాటు చేస్తాం

మూలమలుపుల్లో ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకుంటాం. త్వరలో రోడ్డును క్షేత్రస్థాయిలో పరిశీలించి రేడియం స్టిక్కర్లు, సూచికలు ఏర్పాటు చేయిస్తాం. రోడ్డు ప్రమాదాల నివారణకు వేగనియంత్రణ చర్యలు చేపడతాం.

ప్రభాకర్, డీఈఈ, దేవరకొండ.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె



తండ్రి అంత్యక్రియల్లో ముందు నడుస్తున్న జోగు సైదమ్మ

నార్కట్‌పల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తండ్రికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు పూర్తి చేసింది ఓ కుమార్తె. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టులో గురువారం చోటు చేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన మోటె మల్లయ్య(70) వృద్ధాప్యంతో మృతిచెందాడు. కాగా మల్లయ్యకు ముగ్గురు కుమార్తెలు కాగా కుమారులు లేరు. ముగ్గురు కుమార్తెల వివాహాలు జరిగాయి. మల్లయ్య చనిపోగా ఆయన పెద్దకుమార్తె శాలిగౌరారం మాజీ ఎంపీటీసీ జోగు సైదమ్మ తండ్రి అంత్యక్రియలకు ముందు నడిచింది. హిందూ సంప్రదాయం ప్రకారం తలకొరివి పెట్టి తన తండ్రికి కొడుకు లేని లోటును తీర్చింది.

ఇంకుడు గుంత నిర్మించుకోవాలి

మద్దిరాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటి ఆవరణలో ఇంకుడుగుంత నిర్మించుకోవాలని సూర్యాపేట జడ్పీ సీఈవో, డీఆర్‌డీవో పీడీ అప్పారావు అన్నారు. గురువారం మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో ఇంకుడుగుంతలు, పశువుల కొట్టాలను పరిశీలించి, మాట్లాడారు. ఇంకుడు గుంతల గురించి ప్రజలకు ఉపాధి సిబ్బంది వివరించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఇంకుడుగుంతల నిర్మాణంతో భూగర్భజలాలు వృద్ధి చెందుతాయన్నారు. వేసవిలో నీటి కొరతకు అవకాశం ఉండదన్నారు. వానాకాలం నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఏపీవో గుండు వెంకన్న, సిబ్బంది చారి, మురళి, పంచాయతీ కార్యదర్శి ఉమ, ఎఫ్‌ఏ ఉమ ఉన్నారు.



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న అప్పారావు

ఉపాధిహామీలో పనుల జాతర



- కూలీలకు ఉపాధి కల్పన భరోసా
- నేటి నుంచి ఉమ్మడి జిల్లాలో పనుల గుర్తింపు

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ అర్బన్)

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో పనులు కల్పించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. 2025-26 ఆర్థికసంవత్సరానికి కూలీలను పనులు కల్పించేందుకు ఈ నెల 22 నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పనుల జాతర కార్యక్రమానికి అధికారయంత్రాంగం శ్రీకారం చుట్టింది. గ్రామసభల్లో స్థానికుల సమక్షంలో 18రకాల పనులను గుర్తించనున్నారు. కూలీలకు 100 రోజుల పనిదినాలు కల్పించేందుకు వీలుగా వార్షిక ప్రణాళిక రూపొందించనున్నారు. కార్యక్రమానికి ఎంపీ, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్యఅతిథులుగా హాజరవుతండగా, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులతో పాటు పంచాయతీరాజ్, స్వచ్ఛభారత్‌మిషన్, ఆర్ డబ్ల్యూఎస్ శాఖల అధికారులు పాల్గొననున్నారు.

అభివృద్ధి పనులకే ప్రాధాన్యం

ఉపాధిలో అభివృద్ధి పనులకు తొలి ప్రాధాన్యం ఇచ్చేందుకు పనుల జాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీకేంద్రాల నిర్మాణం, స్వచ్ఛబారత్ మిషన్ ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాల డంపింగ్‌యార్డ్, సెగ్రిగేషన్‌షెడ్, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, సీసీ రోడ్ల పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అదేవిధంగా 2024-25 ఆర్థికసంవత్సరంలో ఉపాధి నిధులతో చేపట్టిన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమాలను చేపడతారు. పాడిపోషణను ప్రోత్సహించేందుకు ఇందిరమ్మమహిళా శక్తి- ఉపాధి భరోసా కింద స్వయం సహాయకసంఘాల్లోని మహిళలకు పశువుల పాకలు, కోళ్ల, గొర్రెల షెడ్లు, వ్యవసాయ బావుల తవ్వకాలు, కంపోస్టు ఎరువు తయారీ యూనిట్లను మంజూరు చేస్తారు. గ్రామసభల్లో లబ్ధిదారులు ఆసక్తిచూపిన యూనిట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేయనున్నారు. ప్రతి గ్రామంలో కనీసం ఒక పనినైనా ప్రారంభించేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఫలవనాలు-వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యమిస్తారు. జలనిధి కార్యక్రమంలో భాగంగా భూగర్భజలాలను మెరుగుపరిచేందుకు వీలుగా నీటిసంరక్షణ చర్యలు చేపట్టడం, పచ్చదనాన్ని పెంపొందించడంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టేవారిని, గత ఆర్థికసంవత్సరంలో అత్యధికం ఉపాధిహామీ పనిదినాలు ఉపయోగించుకున్న కుటుంబాలను గుర్తించి సన్మానిస్తారు.

రూ.37.50 కోట్లతో 3,918 రకాల పనులు

గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ద్వారా ఉమ్మడి జిల్లాలో 3,918 రకాల పనులకు పరిపాలన పరమైన అనుమతులు లభించాయి. ఆయా పనులను అధికారులు గుర్తించిన గ్రామాల్లో చేపట్టేందుకు రూ.37.50కోట్ల నిధులను 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఖర్చుచేయనున్నారు. మంజూరైన పనుల వివరాలు ఇలా ఉన్నాయి. రూ.93లక్షలతో 940 పశువులపాకల నిర్మాణం, రూ.7.72లక్షలతో 429 నాడెప్ కంపోస్ట్‌పిట్ల నిర్మాణాలతో పాటు రూ.10లక్షలతో 452 నాచుతయారీ కేంద్రాలు (అజోలా), రూ.8లక్షలతో 63మేకలు/గొర్రెల పాకలు, రూ.7.80లక్షలతో 26 కోళ్లఫారాలు, పాఠశాలల్లో 62 మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.15.50 లక్షలు కేటాయించారు. అదేవిధంగా తాగునీటి సదుపాయాలకు రూ.8లక్షలతో 213 మినీవాటర్‌ట్యాంకుల నిర్మాణం, రూ.35లక్షలతో 62 వ్యవసాయబావుల తవ్వకాలు, బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్టర్ కింద రూ.6.57లక్షలతో 153 యూనిట్ల పనులు మంజూరయ్యాయి. 539 ఇంకుడుగుంతల నిర్మాణంకోసం రూ.35లక్షలు కేటాయించారు. చెక్‌డ్యాం నిర్మాణాలు రూ.5లక్షలు, 10 ఆర్‌ఎఫ్‌డీల కోసం రూ.6లక్షలు, 18సీఎస్‌సీల నిర్మాణం కోసం రూ.5.40లక్షలు, రూ. 20లక్షలతో 5 పీడబ్ల్యూఎం నిర్మాణాలు, 24 సెగ్రిగేషన్ షెడ్స్ నిర్మాణాల కోసం రూ.39లక్షలు, 792కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణం కోసం రూ.73.45లక్షలు కేటాయించారు. 64 అంగన్‌వాడీ భవనాల నిర్మాణం కోసం రూ.7.68కోట్లు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం కోసం రూ.13కోట్ల నిధులను కేటాయించారు.

అభివృద్ధి పనులతో పాటు కూలీలకు ఉపాధి



గ్రామీణాభివృద్ధి పనులతో పాటు కూలీలకు 100రోజుల పని కల్పించేందుకు కృషి చేస్తున్నాం. నల్లగొండ జిల్లావ్యాప్తంగా నేటినుంచి పనుల జాతర కార్యక్రమానికి ఏర్పా ట్లు పూర్తిచేశాం. పాడిరైతులను ప్రోత్సహిం చాలన్న ఉద్దేశ్యంతో స్వయం సహాయకసంఘాల సభ్యులకు ప్రాధాన్యనిస్తున్నాం. ప్రజల జీవనోపాధి పెంచేందుకు పలు వ్యక్తిగత పథకాలను ప్రభుత్వం అమలుచేస్తుండగా, క్షేత్రస్థాయి విధులను సమర్థంగా పూర్తిచేసేందుకు లబ్ధిదారులను గుర్తిస్తాం. గ్రామీణప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

వై.శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీవో పీడీ, నల్లగొండ

ఊకొండిలో వివాహిత ఆత్మహత్య



లక్ష్మీ ప్రసన(ఫైల్)

మునుగోడు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మునుగోడు మండలం ఊకొండి గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ మండలం అప్పాజిపేట గ్రామానికి చెందిన కల్లూరి శంకరయ్య రెండో కుమార్తె లక్ష్మీప్రసన్నకు మునుగోడు మండలం ఊకొండి గ్రామానికి చెందిన బోయపల్లి నాగరాజుతో ఈ ఏడాది మార్చి 2న వివాహమైంది. ఆషాఢమాసంలో తల్లిగారింటికి వెళ్లిన లక్ష్మీప్రసన్న ఇటీవల గ్రామంలో జరిగిన బోనాల పండగను కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడిపింది. కాగా గురువారం ఇంట్లోనే తన గదిలో క్రిమిసంహారక మందు తాగింది. ఇంటి పక్కన ఉన్న మహిళ వచ్చి చూసేసరికి లక్ష్మీప్రసన్న అపస్మారక స్థితిలోకి వెళ్లింది. చుట్టుపక్కల వారికి, కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపి హుటాహుటినా నల్లగొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని మునుగోడు ఎస్‌ఐ రవి తెలిపారు.

విద్యార్థి అదృశ్యం, కేసు నమోదు



రితిష్‌యాదవ్

భువనగిరి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం అనంతారంలోని డిఫెన్స్ కళాశాల నుంచి ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని ఓల్డ్ బేగంపేటకు చెందిన రాశి నగేశ్‌యాదవ్ కుమారుడు రాశి రితిష్‌యాదవ్(18) భువనగిరి మండలం అనంతారం శివారులోని శ్రీ వాగ్దేవి డిఫెన్స్ కళాశాలలో(ఆర్మీ)కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం కళాశాల నుంచి కనిపించకుండాపోయాడు. ఈ విషయమై కళాశాల నిర్వాహకులు విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో గురువారం తండ్రి నగేశ్‌యాదవ్ భువనగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు.ఈమేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపారు. వివరాల కోసం 8712662472 సెల్‌నెంబర్‌ను సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో కోరారు.

ఎరువుల కొరత.. రైతుల వెత



కోదాడరూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా అవసరమైన ఎరువులు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

» ఇదే అదునుగా అధిక ధరలకు డీలర్ల విక్రయం

సూర్యాపేట జిల్లాలో 11 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో బావులు, చెరువులు, కుంటల కింద రైతులు పెద్ద ఎత్తున వరి సాగుచేస్తున్నారు. అనంతగిరి మండలంలో 13,168హెక్టార్లు, చిలుకూరు మండలంలో 20,330, కోదాడ 21,150, మోతె 22397, మునగాల 13407, నడిగూడెం 9535 హెకార్లలో వరి సాగుచేస్తున్నారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవటంతో అధిక ధరలకు చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది ముందుగా వర్షాలు పడటంతో రైతులు, బావులు, చెరువులు, కుంటల కింద ముందస్తుగా నార్లు పోశారు. రైతులకు అవసరమైన డీఏపీ, యూరియా అందుబాటులో లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. సహకార సంఘాల్లో కూడా ఎరువులు ఈ సంవత్సరం సకాలంలో అందకపోవడంతో రైతులు ఎరువుల దుకాణాలు, సహకార సంఘాల చుట్టూ తిరుగుతున్నారు. పోసిన నారు ఏపుగా పెరుగుతోంది తప్ప నాటు వేసేందుకు అవకాశం లేకుండా పోయిందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తున్న డీలర్లు

యూరియా, డీఏపీ కొరత తీవ్రంగా ఉండటంతో ఇదే అదునుగా ఎరువుల దుకాణం డీలర్లు అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 265 రూపాయల యూరియా కట్ట 450 రూపాయలు విక్రయిస్తున్నారు. 1325 డీఏపీ కట్టను 1600 రూపాయలకు అమ్ముతున్నారని రైతులు ఆరోపించారు. ఈ విషయంపై అధికారులకు తెలిపినా కూడా పట్టించుకోవటం లేదన్నారు. పొటాష్ కూడా 1800కు పైగా విక్రయిస్తున్నారని వారు అన్నారు.

ఊహించని విధంగా పెరిగిన సాగు

సంవత్సరం ఊహించని విధంగా సాగు పెరిగిపోవడంతో దానికి అనుగుణంగా ఎరువులు సరఫరా కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నది వాస్తవవమే అని అధికారులు పేర్కొంటున్నారు. సహకార సంఘాల్లో కూడా ఈ సంవత్సరం ప్రభుత్వం సరిపడా ఎరువులను సరఫరా చేయకపోవడంతో రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



యూరియా డీఏపీ, పొటాష్ అధిక ధరలకు విక్రయించినట్లయితే చర్యలు తీసుకుంటామని ఏడీఏ ప్రశాంతి తెలిపారు. యూరియా కొరత ఉన్నమాట వాస్తవమే అన్నారు. సహకార సంఘాల్లో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ అందుబాటులో ఉందన్నారు.

ఏ మండలానికి ఎంత అవసరమంటే...

మండలం	యూరియా మె.ట అవసరం/నిల్వ	డీఏపీ మె.ట అవసరం/నిల్వ	కాంప్లెక్ మె.ట అవసరం/నిల్వ
కోదాడ	5310/442	2950/301	3982/435
మోతె	3400/276	1350/143	3200/551
అనంతగిరి	26,26/143	226/16	1226/38
చిలుకూరు	30,38/26	200/18	2230/391
మునగాల	3530/456	1020/163.85	3010/711.95
నడిగూడెం	4700/130	2350/70	3650/120



తిప్పర్తి పీఏసీఎస్ వద్ద యూరియా లోడ్ దించుకున్న సిబ్బంది

యూరియా కోసం ఇక్కట్లు

తిప్పర్తి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులు పడిగాపులు కాశారు. గురువారం తిప్పర్తి మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రం వద్దకు ఒక లారీ యూరియా వచ్చింది. లోడ్‌లో 440 బస్తాల యూరియాను ఒక్కో రైతుకు 2 బస్తాల చొప్పున ఇచ్చి పంపిణీ చేశారు. యూరియా లారీ వద్ద రైతులు ఆందోళన చేయకుండా పూర్తిగా పోలీస్ పహారా ఉంచి ఎస్ఐ వి. శంకర్ ఆధ్వర్యంలో రైతులందరికీ పంపిణీ చేయించారు. కాగా మరో 300ల మంది ప్రస్తుతం ఆధార్ కార్డులను లైన్‌లో ఉంచినట్లు సమాచారం. కాగా మరో రెండు రోజుల్లో ఎక్కువ మొత్తంలో యూరియా రానున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

తిరుమలగిరిలో తంటాలు

తిరుమలగిరి, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని పీఏసీఎస్ ఎరువుల దుకాణం వద్ద రైతులు పడిగాపులు కాశారు. మధ్యాహ్నం 12గంటలు దాటినా దుకాణం తెరవకపోవడంతో, దుకాణం వద్ద నిరీక్షించారు. దుకాణం తెరిచిన వెంటనే ఒక్కసారిగా యూరియా కోసం రైతులు చేరుకోవటంతో, ఉదయం నుండి నిల్చున్నా, కొంతమందికి యూరియా లభించలేదని, మరికొందరికి రెండు, లేదా మూ డు బస్తాలే ఇచ్చారని, వారికి నచ్చిన వారికి మాత్రం ఎక్కువ బస్తాలు ఇచ్చారని వాపోయారు. కొందరు ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో యూరి యా కోసం వె ళితే గుళికలు కొంటేనే యూరియా ఇస్తామని షరతులు పెడుతున్నారని రైతులు వాపోయారు.



యూరియా కోసం వేచి ఉన్న రైతులు



కట్టంగూరులో యూరియా కోసం బారులు తీరిన రైతులు

కట్టంగూరులో బారులు

నార్కట్‌పల్లి/ కట్టంగూరు/ హాలియా, ఆగస్టు 21: నార్కట్‌పల్లి, కట్టంగూరు, హాలియా మండల కేంద్రాలకు యూరియా వచ్చిందని తెలియగానే రైతులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఒక్కో రైతుకు ఒకటి లేదా రెండు బస్తాలు ఇవ్వడంతో సరిపడా యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కట్టంగూరులో ఎస్ఐ రవీందర్ పోలీస్ సిబ్బందితో వచ్చి పోలీస్ పర్యవేక్షణలో టోకెన్లు పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి సతీష్ పీఏసీఎస్‌ను పర్యవేక్షించారు. కట్టంగూరు మండలానికి 2400 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటి వరకు 1800 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు ఏవో గిరి ప్రసాద్ తెలిపారు. నార్కట్‌పల్లి పీఏసీఎస్‌కు ఉదయం 400 బస్తాల యూరియా రాగా ఉదయం11 గంటలకే 200బస్తాలు అయిపోయాయి. అనుముల మండలం కొత్తపల్లి పీఏసీఎస్ గోదాంకు 20 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్న విషయం తెలుసుకున్న రైతులు పరిసర గ్రామాల నుంచి భారీగా తరలివచ్చారు. ఒక్కో పాస్ బుక్‌కు మూడు బస్తాలు మాత్రమే ఇస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు.

ప్రపంచం ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుంది

ప్రజావాగ్గేయకారుడు ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



వీధినాటకోత్సవంలో పాట పాడుతున్న వాగ్గేయకారుడు గోరటి వెంకన్న

రామన్నపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తరాలు మారినా ప్రజా కళాకారుల స్వరాలు మారవని, ఈ భూ ప్రపంచం ఉన్నంత కాలం ఎర్రజెండా ఉంటుందని, పోరాట ఆయుధాలుగా మలిచే కళారూపాలు ఉంటాయని ప్రజావాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో రెండోరోజు జరిగిన వీధి నాటకోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజానాట్యమండలి కళాకారులు తేనెతో నిండిన తియ్యటి పండ్లు లాంటివారని, నిస్వార్థంగా ప్రజాకళను బ్రతికిస్తున్నారన్నారు. పాటతో నైజాం నవాబు గుండెల్లో తూటాలు పేలిన సుద్దాల హనుమంతు నడయాడిన నేల రామన్నపేట ప్రజాకళాకారులతో నేడు పునీతమైందని, ఇలాంటి మహోన్నతమైన ప్రజా కళారూపాల ప్రదర్శన నిర్వహించడం ప్రజా కళలను నిజంగానే బతికించడమేనన్నారు. అనంతరం ప్రజానాట్యమండలి కళాకారుల వీధి నాటకాలు ప్రజలను ఆకర్షించాయి. 'అది నాదే ఇది నాదే', 'ఆడపిల్ల' ఒగ్గు కథ, 'రైతు బతుకు', హరే రామ హరి' అనే నాటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వేముల ఆనంద్, కట్టా నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవ్వారు గోవర్ధన్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటెపాక శివకుమార్, ఈర్లపల్లి ముత్యాలు, డి.రవి, కుమ్మరి శంకర్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయస్థాయిలో రాణించాలి

● ఎంజీయూ రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి

నల్లగొండ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ స్థాయిలో రాణించి ఎంజీయూ ఖ్యాతిని చాటాలని రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి సూచించారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీలో వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ పరేడ్ 2025 కోసం ఎంజీయూ పరిధిలోని ఉమ్మడి జిల్లాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఎంపికను గురువారం యూనివర్సిటీలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్ఎస్ఎస్ రీజినల్ యూత్ ఆఫీసర్ సైదా నాయక్ హజరై వాలంటీర్లకు రన్నింగ్ పరేడ్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన వలంటీర్ల జాబితాను త్వరలో ప్రకటిస్తామన్నారు. ఎంపికైన వలంటీర్లు గుజరాత్‌లో జరిగే శిబిరానికి పంపిస్తామని, వలంటీర్లు కళాశాల బోనఫైడ్ సర్టిఫికెట్ ఐడీ కార్డు స్పెషల్ క్యాంపు సర్టిఫికెట్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఎంజీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పసుపుల మద్దిలేటి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్టేట్ ఎన్ఎస్ఎస్ అధికారి నరసింహ, ప్రోగ్రాం అధికారులు వీరస్వామి, సుధాకర్, ఆనంద్, శ్రీనివాస్, కాంతయ్య, దయానంద్, శ్యామల, మేనేశ్వరి, పావని, శృతి, వలంటీర్లు పాల్గొన్నారు.

నానో యూరియా వాడకంతో అధిక ప్రయోజనం

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటరమణారెడ్డి

ఆలేరు/ మోత్కూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వాడకంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆలేరు మండలం బహదూర్‌పేటలో రైతులకు నానో యూరియా వాడకంతో సాగు చేసిన పత్తి పంటను సందర్శించి వారికి అవగాహన కల్పించారు. నానో యూరియా వాకడంపైన రైతులకు గల సందేహాలను నివృత్తి చేశారు. 45కిలోల యూరియా బస్తాకు 500 మిల్లీ లీటర్ల నానో యూరియా సమానమని, రేటు కూడా అంతేనని వివరించారు. పంటల మీద యూరియా చల్లితే సగం నత్రజని మాత్రమే మొక్కలో చేరుతుందని మిగిలినది నేలనీటితో కలిసి కాలుష్యాన్ని పెంచుతుందని, అదే నానో యూరియాను స్ప్రే చేయడం ద్వారా నత్రజని నేరుగా మొక్కలో చేరుతుందన్నారు. ఈ యూరియా వాడకం ద్వారా యూరియా వినియోగాన్ని 25 నుంచి 40శాతం తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారని అన్నారు. పంట దిగుబడి కూడా బాగా పెరుగుతుందని ద్రవ రూపంలో ఉండే నానో యూరియాలోను యూరియాతో సమానమైన నత్రజని ఉంటుందని తెలిపారు. దీని రవాణా నిల్వ వినియోగం కూడా సులభం ఉండడమే కాకుండా రైతులకు ఆర్థిక భారం తగ్గిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఏఈఓలు షాలిని, శివ కుమార్, రైతులు స్వామి, రాజు, వినయ్, మల్లయ్య, శేఖర్, పలువురు మహిళా రైతులు పాల్గొన్నారు.



ఆలేరు: బహదూర్‌పేటలో నానో యూరియా వాడకంతో సాగుచేసిన పత్తిపంటను రైతులకు చూపుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

● పంటలకు నానో యూరియా, నానో డిఏపీ వాడకం వల్ల అధికప్రయోజనం చేకూరుతుందని ఎంఏవో వి.కీర్తి అన్నారు. నానో యూరియా వాడకంతో చేకూరే ప్రయోజనాలపై మోత్కూరు మండలంలోని పాటిమట్ల గ్రామంలో ఆమె రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాటిమట్ల, దత్తప్పగూడెం ఏఈవోలు ఎం.అశోక్‌కుమార్, ఆర్.సింహప్రసాద్, రైతులు బండ నర్సిరెడ్డి, దొండ దశరథ, బండి రవి, వెంకట్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

యూరియా కొరత కారణంగా ఎరువుల దుకాణాల యజమానులు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. లింకులు పెట్టి అమ్ముతున్నారు. సకాలంలో దొరక్క రైతులు యూరియా కోసం రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. లోడ్ వచ్చిందని తెలియగానే వెళ్లి గంటల తరబడి లైన్లలో నిల్చుని అష్టకష్టాలు పడి తీసుకెళ్లుతున్నారు. దీనిపై నెల 6న 'అవగాహన కల్పిస్తే ప్రయోజనం' శీర్షికన నానో యూరియా, నానో డీఏపీ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికిఅధికారులు స్పందించారు. నానో యూరియా వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అవగాహన కల్పిస్తున్నారు.

ఎంజీయూ అధ్యాపకులకు శిక్షణ

నల్లగొండ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం అధ్యాపకుల నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇన్ఫిఫ్ నెట్ సంస్థ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టంపై అధ్యాపకులకు శిక్షణ ఇచ్చింది. ఈ సందర్భంగా ఇన్ఫిఫ్ నెట్ సంస్థ ప్రతినిధి అర్షద్‌ఖాన్ సారథ్యంలో మూక్స్ ఆన్‌లైన్ కోర్సులను రూపొందించుట, ముఖ్యమైన విద్యా సంబంధిత విషయాలను విద్యార్థులకు సదా అందుబాటులో ఉంచే విధానాలు, పరిశోధనలు, వాటి ప్రచురణాలు వంటి అంశాలపై ఆన్‌లైన్ ద్వారా వివరించారు. ఇన్ఫిఫ్ నెట్లో విశ్వవ్యాప్తంగా జరిగే అధునాతన పరిశోధనలను అందుబాటులోకి తెచ్చిందని, వీటి ద్వారా అధ్యాపకులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ విద్యార్థులకు బోధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అలువాల రవి, డైరెక్టర్ మిర్యాల రమేష్, డాక్టర్ శ్వేత, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ మచ్చేందర్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజేతలుగా నిలవాలి



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడా జట్లు

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కొమరభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 23వ తేదీ నుంచి నిర్వహించే రాష్ట్ర స్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా జట్లు విజేతలుగా నిలవాలని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అవిశెట్టి బయన్న కోరారు. గురువారం క్రీడా జట్లకు యూనిఫాం, క్రీడా మెటీరియల్స్ అందజేసి మాట్లాడారు. పురుషుల, మహిళల జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొంది జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. . ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అవిశెట్టి బయన్న, ప్రసాద్, శంకర్, అలీం, ఆసద్, ఉమామహేశ్వర్, కోచ్‌లు పాల్గొన్నారు.

నా రాజీనామాతోనే గట్టుప్పల్ మండలం ఏర్పడింది

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

గట్టుప్పల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పదవికి తాను రాజీనామా చేస్తేనే గట్టుప్పల్ మండలం ఏర్పడిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఓ పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవానికి ఆయన హాజరై మాట్లాడుతూ కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి వల్ల మండలం రాలేదని అతను అసెంబ్లీలో మాట్లాడినా మండలం ఏర్పడలేదని.. తాను రాజీనామా చేస్తేనే ప్రభుత్వం దిగివచ్చి మండలం ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన నిధులతో పాటు సొంత డబ్బుతో అభివృద్ధి చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. పాఠశాలల అభివృద్ధికి ఆర్థికంగా స్థిరపడినవారు మానవతా దృక్పథంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్యం ప్రతీ మనిషికి రెండు కళ్లలాంటివని గుర్తుచేశారు. అందుకే తల్లి సుశీలమ్మ పేరుతో ఫౌండేషన్ ద్వారా అన్ని మండల కేంద్రాలలో ఉచిత కంటి వైద్య శిబిరాలు సైతం ఏర్పాటు చేశానని తెలిపారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా తాను నిరంతరం అండగా ఉంటానని అన్నారు. త్వరలోనే గట్టుప్పల్ మండలానికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పనులు ప్రారంభిస్తానని అన్నారు. సొంత డబ్బుతో ఈ పాఠశాలను కట్టించి విద్యార్థుల భవిష్యత్తుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్న ఇడెం శ్రీనివాసులును అభినందించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల సమితి అధ్యక్షుడు ఇడెం శ్రీనివాస్. రాష్ట్ర మునిసిపల్ మాజీ అసోసియేషన్ అధ్యక్షుడు వెన్ రెడ్డి రాజు, సీఐ ఆదిరెడ్డి, తహసీల్దార్ రాములు. మాజీ సర్పంచ్ నామ జగనాథం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి శ్రీనివాసు, రావుల రమేష్, టేకుమట్ల శ్రీరాములు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



డెడ్ స్టోరేజీకి చేరువలో బీ.వెల్లెంల రిజర్వాయర్

డెడ్ స్టోరేజీకి బీ.వెల్లెంల రిజర్వాయర్

నార్కట్‌పల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వారం రోజులుగా భారీ వర్షాలు కురిసి చిన్నచిన్న కుంటలు చెరువులు జలకళను సంతరించుకుంటుంటే నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరుకుంది. ఓ వైపు నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి 26 క్రస్టు గేట్లను ఎత్తి కృష్ణానీటిని దిగువకు విడుదల చేసే బదులుగా, రిజర్వాయర్‌లు నింపి రిజర్వాయర్‌ల ద్వారా చెరువులను ఎందుకు నింపడం లేదని ప్రాజెక్టు సందర్శనకు వస్తున్న రైతులు ప్రశ్నిస్తున్నారు. డెడ్ స్టోరేజీకి చేరువలో ఉన్న రిజర్వాయర్‌ను చూసి రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రిజర్వాయర్ నుంచి కాలువలకు విడుదలవుతున్న నీటి పరిమాణం కూడా రోజురోజు తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం 290.7 మీటర్ల లోతులో మాత్రమే నీటి నిల్వ ఉంది. కనీసం ఇంతకన్నా ఇంకా ఒక్క మీటరు కిందకు తగ్గినా కాల్వలకు నీటి విడుదల సాధ్యం కాదని, కనీసం 291.7 మీటర్ల లెవెల్ ఉంటే కాలువలకు నీటి విడుదలచేయడం సాధ్యమవుతుందని ప్రాజెక్టు ఇంజనీర్లు చెబుతున్నారు.

రివిట్‌మెంట్ సమస్యే కారణం?

బీ.వెల్లెంల ఉదయ సముద్రం రిజర్వాయర్‌కు పానగల్ ఉదయ సముద్రం రిజర్వాయర్ నుంచి టన్నెల్ ద్వారా నీరు చేరనుంది. అదేవిధంగా పానగల్ ఉదయ సముద్రానికి కూడా ఎస్ఎల్‌బీసీ కాలువ నుంచి నీరు వస్తోంది. అయితే పానగల్ ఉదయ సముద్రం ప్రాజెక్టు కట్టకు ఓ చోట రివిట్‌మెంట్ కూలడంతో మరమ్మతులు చేసేంత వరకు నీటి అడుగుల నిల్వ సామర్థ్యం పెంచడానికి అవకాశం లేదని అధికారులు తెలిపారు. పానగల్ ప్రాజెక్టులో ఇపుడున్న నీటి మట్టానికి బీ.వెల్లెంల రిజర్వాయర్‌కు టన్నెల్ ద్వారా నీరు విడుదల చేయడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో రైతులు సాగు నీటి అవసరాలు, గ్రామాల్లో తాగునీటి అవసరాల కోసం బీ.వెల్లెంల రిజర్వాయర్ నీటిని కుడి ఎడమల కాలువల ద్వారా విడుదల చేయగా పానగల్ ప్రాజెక్టు నుండి బీ.వెల్లెంలకు నీటి రాక ఆగిపోయిన కారణంగానే భారీ వర్షాలు కురుస్తున్నా బీ.వెల్లెంల రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.

'పులిచింతల'కు భారీగా వరద



చింతలపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదల కారణంగా కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టు వద్ద ఇన్‌ఫ్లో 4,28,121, ఔట్‌ఫ్లో 4,31,175 లక్షల క్యూసెక్కులు కొనసాగుతోంది.

● బుగ్గమాదారం - జగ్గయ్యపేట రహదారిలో నిలిచిన రాకపోకలు

దీంతో పులిచింతల ప్రాజెక్టు 13 గేట్లు 4.5మీటర్లు, ఒక్క గేటు 2.5 మీటర్ల మేర ఎత్తి, నీటిని దిగువకు విడుదల చేయడంతో వరద ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. దీంతో బుగ్గమాదారం నుంచి జగ్గయ్యపేట రహదారిలో నాలుగు మీటర్ల మేర నీరు నిల్వ ఉండటంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వజినేపల్లి, బుగ్గమాదారం గ్రామాల్లో లోతట్టు భూముల్లో సాగు చేసి పత్తి, పంట మిర్చి పైర్లు నీట మునిగాయి. పులిచింతల ప్రాజెక్టు జలాశయానికి ఇన్‌ఫ్లో 4,28,115 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 4,32,175 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా, ప్రస్తుతం 165.183 అడుగులుగా ఉన్నది. పూర్తిస్థాయి నీటి నిల్వ 45.77 టీఎంసీలుగా ఉంది. నదిలో ప్రస్తుతం 31.8797టీఎంసీలు నీటి నిల్వ ఉంది. . తెలంగాణ ఎడమ విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

సాగర్, మూసీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

నాగార్జునసాగర్,ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువనుంచి 4,32,065 క్యూసెక్కులనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెకు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 583.10 అడుగులుగా (291.9562టీఎంసీలు)నమోదైంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 9,019 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 6,401 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 32,683 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, 26 క్రస్ట్‌గేట్ల నుంచి 3,81,262 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 4,32,065 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా ఎగువనుంచి 4,32,065 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీకి వరద తగ్గుముఖం.. 6గేట్లు ఎత్తి నీటి విడుదల

కేతేపల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గడంతో మూసీ రిజర్వాయర్‌కు వచ్చే ఇన్‌ఫ్లో తగ్గింది. ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు 13రోజులుగా మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. బుధవారం 8059.56క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో గురువారం సాయంత్రానికి కొంత మేర తగ్గి 6835.84క్యూసెక్కులుగా నమోదైంది. మరోవైపు ప్రాజెక్టు నీటిమట్టం 642.37అడుగులకు పడిపోయింది. దీంతో డ్యాం ఇంజనీరింగ్ అధికారులు క్రమంగా ప్రాజెక్టు నీటిమట్టాన్ని 645అడుగుల గరిష్ఠ స్థాయికి చేర్చుతూ ప్రాజెక్టు 2, 3, 4, 7, 8, 10 నెంబరు క్రస్టు గేట్లను ఒక అడుగు మేర ఎత్తి 5949.26క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు 117.67క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 642.40అడుగులు (3.79టీఎంసీలు)గా ఉంది.



అలుగునూరు పాఠశాలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

నూతనకల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలోని అలుగునూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందినట్లు ఆ పాఠశాల హెచ్ఎం ఉప్పు నాగయ్య తెలిపారు. గురువారం నూతనకల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతి, అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను, పరిశ్రమిస్తున్న ఉపాధ్యాయులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 51పాఠశాలలను ఎంపిక చేస్తూ వాటి విజయ గాథలను ట్రయల్ బ్రేజర్స్ అనే పుస్తకంగా ఎస్సీఈఆర్టీ విడుదల చేసిందన్నారు. వాటిల్లో తమ పాఠశాల రెండో స్థానంలో ఉండడం అభినందనీయమని అన్నారు. ఎంపిక కావడానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులను ఆయన అభినందించారు.

లింగ నిర్ధారణ చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాలి

భానుపురి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి నిబంధనలు పాటించనివారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీవో డబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ కోటిరత్నంకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మారసాని చంద్రకళ, జయమ్మ, పద్మ, ఎల్లమ్మ, అనసూయ, బాజి, రజిత, పద్మ, పర్విన్, లక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించడం అందరి బాధ్యత

తుంగతుర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వృద్ధులను గౌరవించడం అందరి బాధ్యత అని తుంగతుర్తి లైన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు తల్లాడ కేదారి అన్నారు. జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని రిటైర్డు ఉద్యోగుల భవనంలో రిటైర్డు ఉద్యోగులు ఓరుగంటి సరోజినమ్మ అంతయ్య, తల్లాడ నారాయణ, బండారి రాములును సన్మానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాము, ఓరుగంటి శ్రీనివాస్, సుభాష్, సంజీవ, గిరి, వేణు, యాకయ్య పాల్గొన్నారు.

నేడు గ్రామ సభలు

నూతనకల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామంలో నేడు ఉపాధి హామీ పనులపై గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో కూలీలకు 100 రోజులు పని కల్పించడం, రైతులకు, ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించడానికి ఈ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

క్షయ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

మద్దిరాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి అమూల్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన క్షయ వ్యాధి శిబిరంలో 15 మంది నుంచి నమూనాలు సేకరించామన్నారు. వారం రోజులుగా రాత్రి పూట జ్వరం, ఎడతెరిపి లేకుండా దగ్గు, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, తెమడలో రక్తం రావడం కనిపిస్తే క్షయ వ్యాధి లక్షణాలుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, ఉషారాణి, పల్లవి, ఆశా కార్యకర్తలు విజయలక్ష్మి, రేణుక, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రహదారి ఇలా.. వెళ్లేది ఎలా?

- అధ్వానంగా అవిరేణికుంటతండా -పెదవీడు రహదారి
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మఠంపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదవీడు నుంచి అవిరేణికుంటతండాకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా 2.4కిలో మీటర్లు ఉన్న ఈ మట్టి రోడ్డు చిత్తడిగా మారుతోంది. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు దట్టంగా పెరిగి రోడ్డును కమ్మేశాయి. దీంతో ఈ రహదారిలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అవిరేణికుంటతండా సమీపంలో రోడ్డుపై గుంతలు పడి వరదనీరు చేరడంతో కుంటలను తలపిస్తోంది. దీంతో ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఐదేళ్ల క్రితం వరకు అవిరేణికుంటతండా పెదవీడు గ్రామ పంచాయతీకి ఆవాసంగా ఉండేది. ఆ తర్వాత తండాను ప్రత్యేక గ్రామ పంచాయతీగా గుర్తించినా, ఈ తండాకు వెళ్లే రహదారిని బీటీగా మార్చడంపై ప్రభుత్వాలు, పాలకులు దృష్టి పెట్టడం లేదు. పెదవీడు మేజర్ గ్రామపంచాయతీ అయినందున అక్కడ బ్యాంకు, పశువైద్యశాల, పోస్టాఫీసు, వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంతో పాటు పలు సిమెంట్స్ పరిశ్రమలు ఉన్నాయి. మట్టపల్లి మహాక్షేత్రానికి వెళ్లాలను ఈ రహదారి నుంచే వెళ్లాలి. అదేవిధంగా పెదవీడు, అల్లీపురం, అమరవరం, కొత్తండా, భీల్యానాయక్‌తండా, దొనబండతండా, యాతవాకిళ్ల, పాలకవీడు, గరిడేపల్లి, జాన్ పహాడ్‌లకు వెళ్లేవారు కూడా ఈ రహదారి నుంచే వెళుతుంటారు. మట్టి రోడు అయినందున వర్షాకాలంలో రాకపోకలు చేయాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు మారినా తమ వెతలు తీరడంలేదని, ప్రభుత్వం స్పందించి అవిరేణికుంటతండా- పెదవీడు మధ్యగల మట్టి రోడ్డును బీటీగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.



పెదవీడు - అవిరేణికుంటతండా రహదారి నాట్లువేసి నిరసన తెలుపుతున్న స్థానికులు



అధ్వానంగా ఉన్న పెదవీడు - అవిరేణికుంటతండా రహదారి

బీటీ రోడ్డుగా మార్చాలి



అవిరేణికుంటతండా నుంచి పెదవీడు వెళ్లే మట్టి రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. దీంతో ప్రజలు ప్రమాదాలబారిన పడి గాయపడుతున్నారు. మట్టి రోడ్డు అయినందున చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు చేరి చెరువులను తలపిస్తోంది. ప్రభుత్వం స్పందించి బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలి.

● బానోతు కొండానాయక్, అవిరేణికుంటతండా

రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం



మండలంలోని పలు గ్రామాలకు ఈ రోడ్డు నుంచే వెళ్లాలి. మట్టి రోడ్డు అయినందున వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం. మట్టపల్లి మహాక్షేత్రానికి కూడా ఈ రహదారి నుంచే వెళ్లాలి. కంప చెట్లు, గుంతలమయంగా ఉన్న ఈ రోడ్డును బీటీగా మార్చి సమస్యలను పరిష్కరించాలి.

● మాలోతు సక్యనాయక్, మఠంపల్లి మండలం

నల్ల బ్యాడ్జీలతో నిరసన రేపు

సూర్యాపేట అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) అమలును నిరసిస్తూ ఈనెల 23వ తేదీన పాఠశాలల్లో ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్స్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని జీవో 28 ద్వారా ఆగస్టు 23వ తేదీన అమలుపర్చిన రోజును బ్లాక్‌డేగా నిరసన తెలపాలని అన్నారు.

జూనియర్ అసిస్టెంట్ మృతి

గరిడేపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గరిడేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ జియావుద్దీన్(55) గురువారం మృతి చెందారు మధ్యాహ్నం సమయంలో విధులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగాగుండెపోటురావడంతో చనిపోయారు. కల్వకుర్తి నుంచి బదిలీ మూడేళ్ల క్రితం గరిడేపల్లి పాఠశాలకు వచ్చారు. జియావుద్దీన్ మృతికి ఉపాధ్యాయులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

హుజూర్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం త్రైత సిద్ధాంత సేవా సంస్థ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భగవద్గీత శ్లోక పారాయణం నిర్వహించారు. ఎన్జీవో కాలనీ నుంచి టీచర్స్ కాలనీ, మిర్యాలగూడ రోడ్డు, ఇందిర సెంటరు మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కమిటీ అధ్యక్షుడు పోటు వెంకటేశ్వర్లు, శైలజ, మహేష్, అరుణ, నర్సింహారావు, శివరామకృష్ణ, జయవాణి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో నూతన వెలుగులు

సూర్యాపేట రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నందున పేదల కళ్లల్లో వెలుగులు నిండాయని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని టేకుమట్ల గ్రామంలో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేసి మాట్లాడారు. టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి సహకారంతో గ్రామంలో 81 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసి, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నరసింహారావు, మాజీ ఎంపీటీసీ చింత అలివేలుకేశవులు, నాయకులు దాసరి నరసయ్య, దాసరి శ్రీనివాస్, వరుణ్, విజయ్, రమేష్ అంజయ్య, పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

హుజూర్‌నగర్ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ మోహన్‌బాబు అన్నారు. గురువారం పట్టణంలో ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ఘర్షణలు జరగకుండా సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఎండీ అజీజ్ పాషా, హరిబాబుచౌదరి, గల్లా వెంకటేశ్వర్లు, సుబ్బరాజు, మట్టయ్య, మల్లయ్య, రామ్మూర్తి, గోవిందరావు, నాగయ్య, శరత్ పాల్గొన్నారు.

కాపులు రాజ్యాధికారం సాధించాలి



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సభ్యత్వం ఇస్తున్న జేపీఆర్

హుజూర్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కాపులు రాజ్యాధికారం సాధించాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లేపల్లి వెంకటేశ్వర్లు కోరారు. గురువారం అసెంబ్లీ హాల్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కాపుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్యపటేల్ ఆధ్వర్యంలో కాపు సంఘం సభ్యత్వ నమోదు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటుచేయాలని, కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడైన ఆది శ్రీనివాస్‌కు సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి పదవి ఇవ్వాలని వారు కోరారు. కాపులు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్తీక్, మహేందర్‌కుమార్‌పటేల్ పాల్గొన్నారు.

నానో యూరియా వాడకం లాభదాయం

మునగాల రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వాడకం రైతులకు లాభదాయకమని మండల వ్యవసాయాధికారి బి.రాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతు పిట్టల శ్రీను వరి పైరులో నానో యూరియా పిచికారీపై క్షేత్ర ప్రదర్శనతో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యూరియా గుళికల కంటే నానో యూరియా ధర తక్కువన్నారు .మండలంలో 1,120 బాటిల్ల నానో యూరియాతో పాటు కొక్కిరేణి, మునగాల, తాడ్వాయి సహకార సంఘాల్లో యూరియా అందుబాటులో ఉందన్నారు.

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

నేరేడుచర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య కోరారు. గురువారం పట్టణంలోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన నేరేడుచర్ల, పాలకవీడు మండలాల రిటైర్డు ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు డీఏలు ఇవ్వలేదని, రెండు సంవత్సరాలైనా ప్రభుత్వం పీఆర్సీ ప్రకటించలేదని, ఆరోగ్యం కార్డుల మంజూరులో జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 11రిటైర్డు ఉద్యోగుల భవనాలు నిర్మించామన్నారు. ఇంకా రెండు భవనాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, బొల్లు రాంబాబు, శ్రీనివాసరావు, సోమయ్య, పూర్ణచంద్రారెడ్డి, వెంకటరమణారావు, సుందరయ్య, రంగారెడ్డిపాల్గొన్నారు.



నేరేడుచర్లలో మాట్లాడుతున్న రిటైర్డు ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య

ఎన్నికల హామీలను అమలు చేస్తాం: వేణారెడ్డి



ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేస్తున్న వేణారెడ్డి, సర్వోత్తంరెడ్డి

చివ్వెంల, సూర్యాపేట టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చందుపట్ల, అక్కలదేవిగూడెం, మోదిన్‌పురం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు, నూతన రేషన్ కార్డులు అందజేసి మాట్లాడారు. లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించాలన్నారు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలకు దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరన్ననాయక్, పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, వాసుదేవరావు, అభినయ్, చింతమళ్ల రమేష్, మధుకర్‌రెడ్డి, కొండల్, హరికృష్ణ, వీరస్వామి, వెంకన్న పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే పార్టీలో చేరికలు

కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పలు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 13వార్డు నుండి వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, ఎలిమినేటి అబినయ్, వీరన్ననాయక్, రమేష్, కర్ణాకర్‌రెడ్డి, పందిరి మల్లేష్, వెంకన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల మోత

(5వ పేజీ తరువాయి)

జిల్లా కేంద్రంలో రూ.316 కోట్లతో 280 కిలోమీటర్ల అండర్‌డ్రైనేజీని నిర్మిస్తున్నారు. దీంతో మురుగు కాల్వలు బహిరంగంగా కనిపించే అవకాశం ఉండదు. దీంతో దోమల వృద్ధి కొంత తగ్గనుం ది. అయితే ఇళ్ల మధ్య పిచ్చిచెట్లతో దోమలు పెరుగుతున్నాయి. ఖాళీ ప్లాట్ నిర్వాహకులు పిచ్చిచెట్లు కొట్టివేస్తే దోమల బెడద ఉండదు.

దోమల నివారణకు రూ.400 వరకు ఖర్చు

దోమల బెడదను తప్పించుకోవడానికి పట్టణంలోని చాలా కుటుంబాలు నెలకు రూ.300 నుంచి రూ.400 వరకు ఖర్చు చేస్తున్నారు. మస్కిటో కాయిల్స్, లిక్విడేటర్స్ వాడుతున్నారు. కొంతమంది రాత్రి పూట బ్యాట్‌లు పట్టుకొని దోమలను చంపుతున్నారు. బజార్‌లో పొగ వదిలితే ఇంట్లోకి దోమలు చేరుతున్నాయి.

దోమలతో నిద్ర పట్టడం లేదు



దోమలతో నిద్ర పట్టడంలేదు. సాయంత్రం తలుపు తీయాలంటే భయం వేస్తోంది. బాత్‌రూమ్‌లు, మురుగుదొడ్లలో విపరీతంగా దోమలు చేరుతున్నాయి. దీంతో వ్యాధులు కూడా వస్తున్నాయి.

●వీరారెడ్డి, పట్టణ వాసి

దోమలతో అనేక వ్యాధులు



దోమలతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలు వస్తాయి. ఇళ్లలో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నీరు నిల్వ ఉంటే దోమలకు ఆవాసాలుగా మారుతాయి. టైర్లలో, ఎయిర్ కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

● డాక్టర్ వూర రామ్మూర్తియాదవ్

దోమల నివారణకు కృషి చేస్తున్నాం



దోమల నివారణకు కృషి చేస్తున్నాం. ప్రతి రోజూ ఉదయం మురుగు కాల్వల్లో బైటెక్స్ మందులు పిచికారీ చేస్తున్నాం. సాయంత్రం ఫాగింగ్ చేస్తున్నాం. అన్ని వార్డుల్లో దశల వారీగా ఫాగింగ్ చేస్తాం.

●సీహెచ్ హన్మంతరెడ్డి, మునిసిపల్ కమిషనర్, సూర్యాపేట

మండపాల నిర్వాహకులు అనుమతి తీసుకోవాలి

మఠంపల్లి, మునగాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల నిర్వాహకులు పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాల వద్ద అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ పంచులు, వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని, డీజేలకు అనుమతి లేదని, సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఐ బాబు ఉన్నారు.

● గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా లౌడ్ స్పీకర్లను రాత్రి 10గంటల వరకే ఉపయోగించాలని మునగాల ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీజేలను అనుమతి లేదన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

తుంగతుర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వ ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు గ్రామాల్లో వర్షాలకు రహదారులు దెబ్బతిన్నందున ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని ఎవరూ పట్టించుకోనందున సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని శాఖల అధికారులతో ఎమ్మెల్యే సామేలు వెంటనే రివ్యూ నిర్వహించిన నష్టవివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గోపగాని రమేష్, అఖిల్, గోపగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు

నిత్యావసర సరుకులు ఎంపిణీ

మఠంపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణతండాకు చెందిన భూక్యరాజు-అరుణ దంపతుల కుమారుడు సాయిరాం పుట్టినరోజు సందర్భంగా గురువారం తండాలోని 10 నిరుపేద కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. అదేవిధంగా కోదాడలోని శనగల అనాథాశ్రమానికి రూ.5వేలు, 50కిలోల బియ్యం అందజేశారు.

ఎరువుల కృత్రిమ కొరతను సృష్టిస్తే చర్యలు

తుంగతుర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ దయానందం హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని సంకల్ప సాయికృష్ణ ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ దుకా ణాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయించొద్దని న్నారు. అన్నారు. దుకాణాలు ఎరువుల ధరల పట్టిక బోర్డును ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం ఆయా దుకాణాల్లోని రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి బాలకృష్ణ, ఎస్ఐ క్రాంతి కుమార్, ఎంఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

మునగాల రూరల్, నూతనకల్ ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్ తెలిపారు. జిల్లా సాంస్కృతిక కళాజాత ఆధ్వర్యంలో గురువారం మండలంలోని తాడ్వాయి, కలకోవ గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మరుగుదొడ్డి నిర్వహణ, ఇంకుడు గుంతల ఆవశ్యకత, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాకారుల ఆట-పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైష్ణవి, వినయ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

● ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి సందీప్ అన్నారు. గురువారం నూతనకల్ మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో సీజనల్ వ్యాధులపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు గుడ్లు పెడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవి, సీహెచ్‌వో చరణ్, పుష్ప, నగేష్, పాల్గొన్నారు.

కోదాడ రూరల్ సీఐగా ప్రతాపలింగం

కోదాడ రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కోదాడ రూరల్ సీఐగా కె.ప్రతాపలింగం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ రూరల్ సీఐగా పనిచేసిన రజితారెడ్డి హైదరాబాద్ మల్టీజోన్-1కు బదిలీ కాగా.. హైదరాబాద్‌లోని సైబర్‌బాద్ జోన్-2లో పనిచేస్తున్న ప్రతాపలింగం ఇక్కడికి వచ్చారు., ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదాడ రూరల్ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని అన్నారు.

వినియోగదారుల మన్ననలు పొందాలి



గండూరి షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేట అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన వస్త్రాలు విక్రయించి వినియోగదారుల మన్ననలు పొందాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గండూరి కృపాకర్ నూతనంగా ఏర్పాటు చేసిన గండూరి షాపింగ్ మాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. మహిళలు, పురుషులు మెచ్చేలా సరికొత్త మోడల్స్‌ను పరిచయం చేస్తూ, 30సంవత్సరాల విశేష అనుభవంతో షాపింగ్‌మాల్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. జిల్లా కేంద్రం వ్యాపార కూడలిగా మారిందని, పెద్ద పెద్ద నగరాలకు దీటుగా జిల్లా కేంద్రంలో అనేక షాపింగ్‌మాల్స్‌ను నెలకొల్పారన్నారు. ఈ అవకాశానిన జిల్లా పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, సవరాల సత్యనారాయణ, గండూరి శంకర్ పాల్గొన్నారు.

సాయిబాబా గుడిలో అన్నదానం

కోదాడ రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి

సూర్యాపేట అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8000కోట్లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దనియాకుల శ్రీకాంత్‌వర్మ అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో భిక్షాటన చేసి మాట్లాడారు. విద్యారంగాన్ని రాష్ట్ర పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని అన్నారు. పేద, బలహీన వర్గాలకు విద్యను దూరం చేసే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈకార్యక్రమంలో నాయకులు వినయ్, శ్రవణ్‌క

నందమూరి పద్మజ మృతి బాధాకరం

కోదాడ టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ పెద్ద కోడలు నందమూరి పద్మజ మృతి బాధాకరమని సామాజిక కార్యకర్త కొల్లు క్షేత్రజ్ఞ అన్నారు. గురువారం కోదాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ తనయుడు జయకృష్ణ సతీమణి, దగ్గుపాటి వెంకటేశ్వరరావు చెల్లెలు పద్మజ మృతిచెందటం తీరని లోటు అని అన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

మేళ్లచెర్వు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం తీసుకుంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి సుధాకర్‌నాయక్ అన్నారు. జువారి సిమెంట్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పౌష్టికాహార కిట్లను అందజేసి మాట్లాడారు.కార్యక్రమంలో సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలి

నేరేడుచర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నేరేడుచర్ల పట్టణం, మండలంలో నెలకొన్న పారిశుధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి వాసా పల్లయ్య కోరారు. ఈ మేరకు గురువారం నేరేడుచర్ల మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ విజయనిర్మలకు వినతి పత్రం అందజేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులు మంజూరు చేయనందున ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయయన్నారు. పారిశు ధ్యాన్ని సరిగా నిర్వహించనందున దోమలు, ఈగలతో పాటు దుర్వాసన పెరిగి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సయ్యద్ హుస్సేన్, రజాక్, ఊబ్బపల్లి సైదులు, వెంకటేశ్వర్లు, చందనబోయిన లక్ష్మి, పావని, రేష్మ, శ్యామల, నాగేందర్ పాల్గొన్నారు.

యూరియా అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం

కోదాడ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి సరిపడా యూరియాను అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్యం పాపిరెడ్డి అన్నారు. గురువారం కోదాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు అదునుకు యూరియాను అందుబాటులో లేనందున నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కేంద్రంతో సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడి, రైతులకు నష్టం జరగకుండా చూడాలన్నారు.

సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి

సూర్యాపేట టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లనో ఈనెల 25వ తేదీన నిర్వహించే సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పొనుగోటి రంగ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీని సమావేశపర్చి బీసీ రిజర్వేషన్ అమలుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ల పెంపునకు జీవో జారీ చేయాలన్నారు. రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే సత్యాగ్రహ దీక్షకు ప్రతిఒక్కరూ తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోలోజు మహేష్‌చారి, గడ్డం లక్ష్మీనారాయణయాదవ్, వీరయ్యపాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై దశలవారీగా ఆందోళనలు

హుజూర్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై దశలవారీగా ఆందోళనలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు కేవీ సత్యనారాయణ, ఆర్.శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కంట్రీబ్యూటరి పింఛన్ విధానాన్ని రద్దుచేయాలన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడంపై సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.